సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

97053 47483

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

వాహనం ఢీకొని గోవుకు గాయాలు



ఆవుకు చికిత్స చేస్తున్న పశు వైద్యులు

బీచ్‌రోడ్డు: పెదవాల్తేరు ప్రభుత్వ మానసిక ఆస్పత్రి జంక్షన్ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఓ గోవుకు తీవ్ర గాయాలయ్యాయి. ఒక్కసారిగా రక్తస్రావంతో పడి ఉన్న ఆవును స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మూడో పట్టణ పోలీస్ స్టేషన్ ట్రాఫిక్ కానిస్టేబుల్ అర్జున్ ఘటనా స్థలానికి చేరుకుని హుటాహుటిన వెటర్నరీ ఆస్పత్రికి సమాచారం అందించారు. ఈ క్రమంలో ఘటన స్థలానికి చేరుకున్న వైద్యులు వెంటనే ఆవుకు వైద్యం చేశారు. ఈ ప్రమాదంలో గోవు కాలికి తీవ్రమైన రక్తస్రావమైంది. ఆవుకు ఏ విధమైన ప్రాణహాని లేదని వైద్యులు ధ్రువీకరించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ఆవును జన సంచారం లేని ప్రాంతానికి తరలించారు. సమయానికి వైద్యులకు సమాచారమందించి స్పందించిన కానిస్టేబుల్ అర్జున్‌ను స్థానికులు ప్రశంసించారు. ఆవును గాయపరిచి ప్రమాదానికి కారణమైన వాహనాన్ని, వ్యక్తిని సమీప సీసీ ఫుటేజ్ ద్వారా పర్యవేక్షిస్తున్నామని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

హెచ్చరికలను విస్మరించి సముద్ర స్నానాలు



ఈత నిషేధం బోర్డుకు చేరువలో సముద్ర స్నానాలు చేస్తున్న సందర్శకులు

ఏయూక్యాంపస్: సముద్రంలో ఈత కొట్టడం, స్నానాలు చేయడం ప్రమాదకరం. ఇదే విషయాన్ని తెలియజేస్తూ పెద్ద బోర్డులు సైతం సాగర తీరంలో ఏర్పాటు చేశారు. అయినప్పటికీ వీటికి చేరువలోనే నిత్యం పదుల సంఖ్యలో సందర్శకులు సముద్ర స్నానాలు చేస్తున్నారు. విశాఖ తీరంలో తరచూ రిప్ కరెంట్‌లు ఏర్పడటం, ప్రజలు ప్రమాదాల బారిన పడటం జరుగుతున్నాయి. తీరంలో జీవీఎంసీ నిషేధిత, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసినా.. వాటిని విస్మరిస్తూ పర్యాటకులు, నగరవాసులు ఈత కొట్టడం, సముద్ర స్నానాలు చేయడం ఎంతో ప్రమాదకరంగా మారుతోంది. విద్యావంతులు సైతం ఇటువంటి చర్యలకు పాల్పడటం కోరి ప్రమాదాలను కొనితెచ్చుకున్నట్లేనని పలువురు అంటున్నారు. సముద్ర స్నానాలు చేసే వారు తగు జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్నారు.

కంపుకొడుతున్న వ్యర్థాలు



రహదారి పక్కన పేరుకుపోయిన వ్యర్థాలు

ఏయూక్యాంపస్: ఏయూ అవుట్ గేట్‌లోని లలితా పీఠం చేరువలో గల కాలువల్లో పేరుకుపోయిన వ్యర్థాలను జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది తొలగించారు. వాటిని రహదారి పక్కన వేసి వదిలేయడంతో దుర్గంధం వెదజల్లుతున్నాయి. రెండు రోజులుగా వర్షం కురవడంతో ఇవి రోడ్డుపైకి వచ్చేస్తున్నాయి. దీంతో ఈ రహదారిలో ప్రయాణించే వారికి ఇబ్బందికరంగా మారాయి. పారిశుధ్య అధికారులు స్పందించి కాలువల్లో తొలగించిన వ్యర్థాలను సత్వరం తొలగించాలని, రోడ్డుపై పేరుకుపోకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

రాజభాష అమలు కమిటీ సమావేశం

తాటిచెట్లపాలెం: దొండపర్తిలోని డీఆర్‌ఎం కార్యాలయంలో గురువారం 79వ రాజభాష అమలు కమిటీ సమావేశం జరిగింది. డివిజనల్ రైల్వే మేనేజర్, టౌన్ అఫీషియల్ లాంగ్వేజ్ ఇంప్లిమెంటేషన్ కమిటీ చైర్మన్ లలిత్ బోరా అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. అధికార భాషా అమలు కోసం తీసుకోవాల్సిన చర్యలపై రీజినల్ ఇంప్లిమెంటేషన్ కార్యాలయ డిప్యూటీ డైరెక్టర్ అనిర్బన్ విశ్వాస్ వర్చువల్‌గా వివరించారు. రాజభాష అమలులో ఈస్ట్ కోస్ట్ రైల్వే ప్రధాన కార్యాలయాల జాబితాలో ప్రథమ స్థానంలో నిలిచిందని ఆయన పేర్కొన్నారు. హిందీ ప్రచారానికి సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం హిందీ కార్యక్రమాల వివరాలను తెలియజేసే 'విశాఖ భారతి' పత్రిక సంచికను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆవిష్కరించారు. అధికారులు పాల్గొన్నారు.

డ్రైనేజీ కనుమరుగు..!



డ్రైనేజీ కనిపించకుండా ఓ వ్యాపారి చేపట్టిన కాంక్రీట్ నిర్మాణం



లాసన్స్ బే కాలనీ బీచ్ రోడ్డులో వెలికితీసిన డ్రైనేజీ

- దశాబ్దాలుగా వ్యాపారుల ఆక్రమణలో చిక్కుకున్న డ్రైనేజీ
- ఓ వ్యక్తి ఫిర్యాదుతో వెలుగులోకి వ్యవహారం
- టన్నుల కొద్దీ పేరుకుపోయిన మట్టి, బురద
- పునరుద్ధరణకు జోన్–3 ఇంజినీరింగ్ విభాగం కసరత్తు

ఎంవీపీకాలనీ: లాసన్స్ బే కాలనీ బీచ్ రోడ్డును అనుకొని ఉన్న డ్రైనేజీ తాజాగా వెలుగులోకి వచ్చింది. డ్రైనేజీ మూతపడటంతో వర్షపు నీరు సరఫరా నిలిచిపోయిందని, పెద్ద ఎత్తున వెలువడుతున్న దుర్వాసన తాళలేక పోతున్నామని ఓ స్థానిక వ్యక్తి చేసిన ఫిర్యాదుతో ఈ వ్యవహారం బయటపడింది. అసలు అక్కడ డ్రైనేజీ ఉందనే విషయమే చాలా మందికి తెలియకపోవడం, దశాబ్దాలు తరువాత ఇది వెలుగులోకి రావడం అందరికీ ఆశ్చర్యం కలిగించింది. ఫుట్‌పాత్‌ను అనుకొని వ్యాపారాలు చేస్తున్న అనేక మంది ఈ డ్రైనేజ్ పైనే షాపులు నిర్మించేయడంతో దశాబ్దాలుగా ఇది మరుగున పడిపోయింది. ప్రస్తుత ఫిర్యాదుతో రంగంలోకి దిగిన జీవీఎంసీ జోన్–3 ఇంజినీరింగ్ అధికారులు ఈ డ్రైనేజీ పూర్తిస్థాయి పునరుద్ధరణకు కసరత్తు ప్రారంభించారు.

శాంతి ఆశ్రమం నుంచి కామత్ వరకు..

లాసన్స్ బే కాలనీ బీచ్ రోడ్డులోని శాంతి ఆశ్రమం నుంచి కామత్ హోటల్ వరకు డ్రైనేజీ ఉంది. దీని ప్రవాహం కామత్ రెస్టారెంట్, బీజేపీ కార్యాలయం మధ్య నుంచి ప్రవహించి ప్రధాన గెడ్డలో కలవాల్సి ఉంటుంది. శాంతి ఆశ్రమం నుంచి కామత్ హోటల్ వరకు మధ్యలో అనేక కమర్షియల్ వ్యాపారాలు 20 ఏళ్లుగా పెరిగాయి. కామత్ రెస్టారెంట్‌తోపాటు మరి కొందరు వ్యాపారులు మాత్రమే బీచ్ రోడ్డును ఆనుకొని ఫుట్‌పాత్, తరువాత డ్రైనేజీ స్థలాన్ని వదిలి పెట్టి నిర్మాణాలు జరుపుకొని వ్యాపారాలు సాగిస్తున్నారు. అదే లైన్‌లో ఉన్న చాలా మంది ఫాస్ట్‌ఫుడ్ వ్యాపారులు, కార్‌షెడ్‌లు, డ్రైనేజీ స్థలాన్ని ఆక్రమించుకుని ఫుట్‌పాత్ వరకు నిర్మాణాలు చేసేసి పూర్తిస్థాయిలో డ్రైనేజీ మూతపడటానికి కారకులయ్యారు. ఆయా వ్యాపారుల ఆక్రమ నిర్మాణాల కారణంగా డ్రైనేజీ భాగం చాలా వరకు షాపుల మధ్యలోకి వెళ్లిపోయింది.

20 ఏళ్లకు పైగా మరుగున..

గత 20 ఏళ్లకు పైగా ఈ పరిస్థితి ఉండటంతో అక్కడ డ్రైనేజీ ఉందనే విషయం కూడా మరుగున పడిపోయింది. జీవీఎంసీ అధికారులు సైతం ఆ డ్రైనేజీని పట్టించుకోకపోవడంతో నిర్మాణాలు పెరిగిపోయాయి. ప్రస్తుతం దీనిపై ఫిర్యాదు రావడంతో జోన్–3 ఇంజినీరింగ్ విభాగం రంగంలోకి దిగింది. ఇటీవల డ్రైనేజీని ఆక్రమించుకొని వ్యాపారులు చేసిన నిర్మాణాలను తొలగించింది. దీంతో కొన్ని షాపులు పూర్తిగా లేచిపోగా.. చాలా వరకు షాపులు పాక్షికంగా తొలగించారు. దశాబ్దాలుగా డ్రైనేజీలో పేరుకుపోయిన టన్నుల కొద్ది మట్టి, బురదను తొలగించి ప్రస్తుతం ఎక్కడికక్కడ ఫుట్‌పాత్‌లపై వేశారు.

చర్యలు చేపట్టిన ఇంజినీరింగ్ విభాగం

ప్రస్తుతం వెలుగులోకి వచ్చిన ఈ డ్రైనేజీని పూర్తి స్థాయిలో పునరుద్ధరించేందుకు జీవీఎంసీ ఇంజినీరింగ్ విభాగం చర్యలు చేపట్టింది. దీనికి సంబంధించి మరమ్మతుల కోసం రూ.9 లక్షలతో టెండర్ కూడా పిలిచినట్లు విభాగ వర్గాలు వెల్లడించాయి. శాంతి ఆశ్రమం నుంచి కామత్ రెస్టారెంట్ వరకు ఈ డ్రైనేజీకి మరమ్మతులు చేపట్టనున్నారు. అనంతరం బీజేపీ కార్యాలయం, కామత్ రెస్టారెంట్ మధ్య నుంచి ఉన్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ మార్గం ద్వారా ఈ డ్రైనేజీ ప్రవాహాన్ని ప్రధాన గెడ్డలోకి పంపించనున్నారు. దీనికి సంబంధించిన కసరత్తు వేగంగా జరుగుతోందని, త్వరలోనే పనులు ప్రారంభం కానున్నాయని జోన్–3 ఇంజినీరింగ్ విభాగం వర్గాలు వెల్లడించాయి. ఈ సమస్యపై అధికారులు దృష్టి సారించి డ్రైనేజీని పునరుద్ధరించాలని, ఫుట్‌పాత్‌లపై వేసిన వ్యర్థాలను తక్షణమే తొలగించాలని స్థానికులు, పాదచారులు కోరుతున్నారు.





లాసన్స్ బే కాలనీ బీచ్ రోడ్డులోని శాంతి ఆశ్రమం నుంచి కామత్ హోటల్ వరకు డ్రైనేజీని ఆక్రమించి నిర్మించిన షాపులు

మొల్లి అప్పారావుకు సాదర స్వాగతం



వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావును ర్యాలీగా తీసుకొస్తున్న పార్టీ నాయకులు

ఎంవీపీకాలనీ: వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ నూతన సమన్వయకర్త మొల్లి అప్పారావుకు పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. సమన్వయకర్తగా నియమితుడైన అనంతరం గురువారం ఆయన విశాఖ చేరుకున్నారు. ఈ సందర్భంగా ఎయిర్‌పోర్ట్‌కు పలువురు పార్టీ ముఖ్య నాయకులు, తూర్పు నియోజకవర్గ శ్రేణులు చేరుకొని స్వాగతం పలికారు. మొల్లి నాయకత్వంలో తూర్పు నియోజకవర్గంలో పార్టీ మరింత బలోపేతమవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు బోని శివరామకృష్ణ, రాష్ట్ర అదనపు కార్యదర్శి మార్కండేయులు తదితరులు ఆయనను సత్కరించారు. అప్పారావు భార్య, కార్పొరేటర్ మొల్లి లక్ష్మి, పెద్ద ఎత్తున పార్టీ తూర్పు నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళా నాయకుల ఆధ్వర్యంలో సత్కారం

వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ మహిళా నాయకుల ఆధ్వర్యంలో మొల్లి అప్పారావును ఘనంగా సత్కరించారు. గురువారం పార్టీ కార్యాలయంలో జరిగిన పార్టీ శ్రేణుల సమావేశం అనంతరం ఆయనను సతీసమేతంగా సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. మహిళా నాయకులు సత్యవతి, జ్యోతి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



కరకచెట్టు పోలమాంబను దర్శించుకుంటున్న మొల్లి అప్పారావు

కరకచెట్టు పోలమాంబను దర్శించుకున్న 'మొల్లి'

బీచ్‌రోడ్డు: వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్తగా నియమితుడై తొలిసారి నియోజకవర్గానికి వచ్చిన మొల్లి అప్పారావు పెదవాల్తేరు కరకచెట్టు పోలమాంబను దర్శించుకున్నారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో ర్యాలీగా వచ్చిన ఆయన అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో 20వ వార్డు కార్పొరేటర్ మువ్వల లక్ష్మీ సురేష్, వివిధ వార్డుల కార్పొరేటర్లు, అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

'ఉక్కు' కాంట్రాక్ట్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

ఆరిలోవ: విశాఖ స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని జూ పార్కు కార్మికులు డిమాండ్ చేశారు. జూ పార్కు జాతీయ రహదారి వైపు ప్రధాన ద్వారం వద్ద గురువారం జూ కార్మికులతో కలిసి సీఐటీయూ మద్దిలపాలెం జోన్ నాయకులు నిరసన తెలిపారు. స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుల నిర్బంధానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సిటు మద్దిలపాలెం జోన్ కార్యదర్శి వెంకటరావు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ఇంతవరకు 1,500 మంది కార్మికులను తొలగించడంతో వారి కుటుంబాలు వీధిన పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. మోదీ ప్రభుత్వం విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు చర్యలు చేపట్టిందని, ఈ ప్రయత్నాలను వెంటనే విరమించుకోవాలన్నారు. సిటు నాయకులు నరేంద్రకుమార్, జూ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు అప్పలరాజు, నరేష్, పైడిరాజు, నర్సింగరావు, శోభారాణి పాల్గొన్నారు.

సీఐటీయూ నాయకుల నిరసన

మద్దిలపాలెం: స్టీల్‌ప్లాంట్ సమ్మెకు సంఘీభావంగా సీఐటీయూ మద్దిలపాలెం జోన్ కమిటీ నాయకులు గురువారం స్థానిక ఆర్టీసీ డిపో వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. మద్దిలపాలెం జోన్ కార్యదర్శి వెంకటరావు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికులపై నిర్బంధం ఆపాలని, తొలగించిన వారిని విధుల్లో తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించేందుకు అనేక కుట్రలు పన్నుతోందని, ఇందులో భాగంగా కాంట్రాక్ట్ కార్మికులను తొలగించడం సరి కాదన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించి, ప్రభుత్వరంగంలోనే కొనసాగించాలని, లేనిపక్షంలో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. జోన్ కోశాధికారి వి.కృష్ణారావు, సిటు నాయకులు వి.నరేంద్రకుమార్, కె.కుమారి, పి.శంకర్‌రావు, ఎ.సింహాచలం పాల్గొన్నారు.



జూ పార్కు గేటు వద్ద నిరసన తెలుపుతున్న జూ కార్మికులు, సీఐటీయూ నాయకులు

పెద్దలను గౌరవించాలి

మురళీనగర్: తల్లిదండ్రులతోపాటు పెద్దలను గౌరవించడం నేర్చుకోవాలని విద్యార్థులకు విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు జీఎస్ఎన్ మూర్తి సూచించారు. మురళీనగర్ మహిళలు, పిల్లల శాఖ గ్రంథాలయంలో గురువారం నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరంలో ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడారు. నైతిక విలువలు పెంచే పుస్తకాలను చదవాలన్నారు. విద్యార్థులు పుస్తక పఠనం చేశారు. లైబ్రేరియన్ వై.పద్మజ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పద క్రీడలను నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

సిరులతల్లికి పంచామృతాభిషేకం



ప్రత్యేక అలంకరణలో కనకమహాలక్ష్మి

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. భక్తులు రూ.1,000 రుసుం చెల్లించి ఈ పూజలో పాల్గొనవచ్చు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు బ్రాంచ్, అకౌంట్ నంబర్ 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

సరస్వతీ నది పుష్కరాలకు ప్రత్యేక బస్సులు

డాబాగార్డెన్స్: సరస్వతీ నది పుష్కరాలకు పయణమయ్యే భక్తుల కోసం ఏపీఎస్ ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసింది. విశాఖ నుంచి పలువురు ప్రయాణికులు, భక్తులు గురువారం బయలుదేరగా.. జిల్లా ప్రజా రవాణా అధికారి బి.అప్పలనాయుడు ద్వారకా బస్ స్టేషన్ వద్ద ఇంద్ర ఏసీ బస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుష్కరాల కోసం ముందుగా సీట్ రిజర్వ్ చేసుకున్న భక్తుల కోసం ఈ బస్సు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శుక్ర, శనివారాల్లో ద్వారకా బస్టేషన్ నుంచి బయలుదేరే సూపర్ లగ్జరీ బస్సులకు సంబంధించిన టికెట్లను ఆన్‌లైన్‌లో apsrtc.com వెబ్‌సైట్ ద్వారా బుక్ చేసుకోవచ్చని చెప్పారు. ప్రయాణికులు పూర్తి బస్సును బుక్ చేసుకోవాలన్నా, విడివిడిగా టికెట్లు కావాలన్నా ఈ అవకాశం ఉందని పేర్కొన్నారు. 34 మంది కలిసి వచ్చినట్లయితే వారికి అనుకూలమైన రోజున ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తామన్నారు. ప్రయాణికుల కోరిక మేరకు విజయవాడ, యాదాద్రి యాత్రలను కూడా కలిపి ఈ ప్రత్యేక బస్సులను అందించనున్నట్లు తెలిపారు. యాత్రికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాలకు 83092 65666, 90522 27083, 99592 25594, 91001 09731 నంబర్లలో సంప్రదించాలని కోరారు. డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ జి.సత్యనారాయణ, డిపో మేనేజర్ కె.గంగాధరరావు, అసిస్టెంట్ ఇంజినీర్ రామకృష్ణ, అసిస్టెంట్ మేనేజర్ ఉజ్వల, సూపర్‌వైజర్లు, సిబ్బంది ప్రయాణికులకు శుభాకాంక్షలు తెలిపారు.

శ్రీ ఆంజనేయం



పాత డెయిరీఫారం వద్ద ఆంజనేయ స్వామికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

- భక్తిశ్రద్ధలతో హనుమాన్ జయంతి
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు



చినగదిలి సాయిబాబా ఆలయ ప్రాంగణంలో తమలపాకులతో అలంకరించిన హనుమాన్



సెక్టార్–6 ఆలయంలో ప్రత్యేక అలంకరణలో హనుమాన్

ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతంలో గురువారం హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆలయాల్లో భక్తులు ఆంజనేయ స్వామికి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. పాత డెయిరీఫారం కూడలి వద్ద హనుమాన్ విగ్రహానికి అధిక సంఖ్యలో భక్తులు పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు మధ్యాహ్నం అన్నసమారాధన చేపట్టారు. చినగదిలి నార్త్ షిర్డీసాయిబాబా ఆలయంలోని ఆంజనేయ స్వామి గుడిలో స్వామిని తమలపాకులతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. శ్రీకాంత్‌నగర్, చినగదిలి, హనుమంతవాక భక్తతుకారాం ఆలయం, విశాలాక్షినగర్‌లోని కోదండరామాలయం తదితర ఆలయాల్లో హనుమాన్‌ను భక్తితో భక్తులు కొలిచారు. సాయంత్రం భజనలు చేశారు.



కొత్త వెంకోజీపాలెం ఆంజనేయ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

విశేష పూజలు, అభిషేకాలు

మద్దిలపాలెం: కొత్త వెంకోజీపాలెం ఆంజనేయ స్వామి ఆలయంలో గ్రామ సేవా సంఘం పెద్దలు, స్థానికులు విశేష పూజలు, అభిషేకాలు చేశారు. వేకువజాము నుంచి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ప్రధానార్చకుడు నరసింహశర్మ భక్తుల పేరిట అర్చనలు జరిపారు. మధ్యాహ్నం మహా అన్నదానం చేపట్టారు.

ప్రత్యేక అలంకరణలో ప్రసన్న ఆంజనేయ

ఎంవీపీకాలనీ: ఎంవీపీ సెక్టార్–6లోని వేంకటేశ్వర స్వామి, ప్రసన్న ఆంజనేయ ఆలయంలో స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. పంచామృతాభిషేకం, విఘ్నేశ్వర ఆరాధన, సింధురార్చన, సహస్ర నాగవల్లీదళార్చనలు నిర్వహించారు. వివిధ ఫలాలు నివేదించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.



హనుమంతుడిని దర్శించుకుంటున్న భక్తులు

రహదారుల్లో గోతులు.. ప్రయాణికుల పాట్లు



చినవాల్తేరు రహదారి మధ్యలో గుంత వద్ద ఏర్పాటు చేసిన చెట్టు కొమ్మ



లాసన్స్ బే కాలనీ పోస్టాఫీస్ రహదారిపై గోతులు

ఏయూక్యాంపస్: చినవాల్తేరు కోటక్ స్కూల్ నుంచి కిర్లంపూడి లే అవుట్‌కు వెళ్లే రహదారి మధ్యలో భారీ గుంత ఏర్పడింది. రాత్రి వేళల్లో ప్రయాణించే వారికి ఇది ప్రమాదకరంగా మారింది. స్థానికులు గుంత వద్ద చెట్టు కొమ్మను ఉంచారు. రాత్రిళ్లు రాకపోకలు సాగిస్తున్న వాహన చోదకులకు ఈ గుంత కనిపించక పోవడంతో ప్రమాదాల బారిన పడుతున్నారు. గతంలో కూడా ఇదే ప్రాంతంలో ఏర్పడిన గొయ్యిని పూడ్చినా.. తిరిగి అదే ప్రాంతంలో నేల కృంగిపోవడంతో ఈ పరిస్థితి తలెత్తింది. సంబంధిత అధికారులు పరిశీలించి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని పలువురు స్థానికులు కోరుతున్నారు.

- లాసన్స్ బే కాలనీ పోస్టాఫీస్ నుంచి హనీ గ్రూప్ కార్యాలయానికి వెళ్లే మార్గంలో రహదారిపై పలు చోట్ల గుంతలు ఏర్పడ్డాయి. యూజీడీ మ్యాన్‌హోల్ అనుసంధానం వద్ద రోడ్డు గోతులుగా దర్శనమిస్తోంది. ఈ మార్గంలో ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి ఈ గోతులను సరిచేయాలని పలువురు స్థానికులు, వాహన చోదకులు కోరుతున్నారు.



లాసన్స్ బే కాలనీలో యూజీడీ వద్ద రోడ్డు పరిస్థితి